క్లుప్తంగా

ఓటరు నమోదును త్వరగా పూర్తిచేయాలి



నాగారం తహసీల్దార్ కార్యాలయంలో ఓటరు జాబితాను పరిశీలిస్తున్న అధికారి

నాగారం : ఓటరు జాబితాలో నూతన ఓటర్ల నమోదు ప్రక్రియను వేగవంతంగా పూర్తిచేయాలని ఓటరు జాబితా పరిశీలన అధికారి నిర్మల అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఓటరు జాబితాను పరిశీలించి మాట్లాడారు. జాబితాలో మార్పులు, చేర్పుల ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అధికారులు ఓటరు జాబితాను పారదర్శకంగా రూపొందించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, ఆర్డీఓ వీరబ్రహ్మచారి, తహసీల్దార్ బ్రహ్మయ్య, డీటీ షాహిన్‌బేగం, ఆర్ఐ లక్ష్మీనర్సింహారావు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ సీనియర్ నాయకుడికి నివాళి

నాగారం : మండల పరిధిలోని డి.కొత్తపల్లి గ్రామానికి చెందిన సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ సీనియర్ నాయకుడు వేముల పెద్ద లింగయ్య శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి గంట నాగయ్య, ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బొడ్డు శంకర్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు పోలేబోయిన కిరణ్‌కుమార్, ఏఐకేఎంఎస్ డివిజన్ అధ్యక్షుడు సంపేట కాశయ్య, సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు మృతుడి పార్థివ దేహాన్ని సందర్శించి, మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేముల పెద్ద లింగయ్య మృతి విప్లవ ఉద్యమాలకు తీరనిలోటని అన్నారు. విప్లవ రాజకీయాలను నిలబెట్టడంలో లింగయ్య కృషి మరువలేనిదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కునుకుంట్ల సైదులు, సంజీవ్, సుధాకర్‌రెడ్డి, ధనుంజయ్, బయ్యం లింగయ్య, భరత్, కృష్ణమూర్తి, పోతులూరి, ఉప్పలయ్య, సంజీవ, వీరయ్య, శ్రీను, ఎల్లయ్య, సోమయ్య, సైదులు, సతీష్, విక్రమ్, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ హెల్త్ కార్డు పొందాలి

తుంగతుర్తి : ప్రతి ఒక్కరూ ఆయుష్మాన్ భవ హెల్త్ కార్డును పొందాలని ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ అన్నారు. ఆయుష్మాన్‌భవ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన మెగా హెల్త్ క్యాంపును ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ఆయుష్మాన్ భవ కార్డును పొంది ప్రభుత్వం అందించే ఉచిత వైద్యసేవలు పొందాలన్నారు. అనంతరం వైద్యసిబ్బంది వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డీఎంఎహెచ్‌ఓ హర్షవర్ధన్, డాక్టర్లు వెంకట్రమణ, నిర్మల్‌కుమార్, నాగునాయక్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



హెల్త్ క్యాంపును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

అధ్వానంగా కాల్వలు.. అందని నీళ్లు

- కంపచెట్లతో నిండి, మరమ్మతులకు నోచుకోని ఎస్సారెస్పీ కాల్వలు
- జాజిరెడ్డిగూడెం మండలంలో చివరి భూములకు చేరని గోదావరి జలాలు

అర్వపల్లి : మండల పరిధిలోని గ్రామాల్లో ఎస్సారెస్పీ కాలువల నిర్వహణ సరిగా లేక రైతులకు గోదావరి జలాలు అందడంలేదు. ముఖ్యంగా చివరి భూములకు నీళ్లందని పరిస్థితి ఏర్పడింది. 2012 సంవత్సర కాలంలో ఎస్సారెస్పీ కాలువల నిర్మాణ పనులు పూర్తయ్యాయి. అప్పటి నుంచి ఇప్పటివరకు సరైన మరమ్మతులు లేకపోవడంతో ఆ కాలువలు ఆనవాళ్లు కోల్పోతున్నాయి. మొత్తం కంపచెట్లతో నిండిపోయి నీరు వెళ్లడంలేదు.

జాజిరెడ్డిగూడెం మండలంలో ఇలా..

జాజిరెడ్డిగూడెం మండలంలో పర్సాయపల్లి నుంచి తిమ్మాపురం వరకు 16 కిలోమీటర్ల 71 డీబీఎం ప్రధాన కాలువ నిర్మించారు. అలాగే దీని పరిధిలో 8ఎల్, 9ఎల్, 10ఎల్, 11ఆర్, 12ఎల్, 13ఆర్, 14ఎల్, 15ఎల్, 16ఆర్ మైనర్ కాలువలు ఉన్నాయి. వీటి పరిధి సుమారు 80 కిలోమీటర్ల పొడవు ఉంటుంది. 71 డీబీఎం ప్రధాన కాలువ మండలంలో 16 కి.మీ ఉండగా ఇందులో కేవలం 2కి.మీ మాత్రమే లైనింగ్ చేశారు. మిగిలిన 14 కి.మీ కాలువ లైనింగ్ కావాల్సి ఉంది. మైనర్ కాలువలు 80 కిలోమీటర్ల పొడవున ఉండగా ఇవి కూడా లైనింగ్ కావాల్సి ఉంది. ప్రస్తుతం ఈ కాలువలన్నీ శిథిలమై కంప చెట్లతో నిండి ఆనవాళ్లు కోల్పోతున్నాయి. జాజిరెడ్డిగూడెం మండలంలో ఎస్సారెస్పీ రెండోదశ కింద 15,967 ఎకరాల ఆయకట్టు ఉంది. కానీ చివరి భూములకు నీళ్లు అందడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాల్వల మరమ్మతు చేయించాలని, లైనింగ్ నిర్మాణం చేపట్టాలని, చివరి భూములకు నీళ్లు అందేలా చూడాలని రైతులు కోరుతున్నారు.



జాజిరెడ్డిగూడెం శివారులో కంప చెట్లతో నిండిన ఎస్సారెస్పీ మైనర్ కాలువ

మరమ్మతులు చేపట్టాలి



ఎస్సారెస్పీ కాల్వలు నిర్మించి 12 ఏళ్లు దాటింది. అప్పటి నుంచి కాలువల మరమ్మతులు, ఆధునీకరణ పనులు ఏమీ చేపట్టలేదు. దీంతో కాల్వలన్నీ అధ్వానంగా మారాయి. కాలువల్లో నీళ్లు వృథా అవుతున్నాయి. కంప చెట్ల కారణంగా చివరి భూములకు నీళ్లు అందడం లేదు. ఇప్పటికైనా కాల్వల ఆధునీకరణ పనులు చేపట్టాలి.

– వజ్జె శ్రీనివాస్, రైతు సంఘం నాయకుడు

ప్రతిపాదనలు పంపాం



ఎస్సారెస్పీ కాలువల ఆధునీకరణ కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరు కాగానే మరమ్మతు పనులు, లైనింగ్ నిర్మాణం చేపడతాం. ప్రస్తుతం ఎప్పటికప్పుడు తాత్కాలిక మరమ్మతులు చేపట్టి రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా చూస్తున్నాం. పంటలకు సాగునీటిని అందిస్తున్నాం.

– జి. హరిస్వరూప్, ఏఈఈ, నీటి పారుదల శాఖ

సమస్యలు పరిష్కరించాలని వినతి



వినతిపత్రం ఇస్తున్న అంగన్‌వాడీలు

అర్వపల్లి : తమ సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీ టీచర్లు, రెండో ఏఎన్ఎంలు శుక్రవారం జాజిరెడ్డిగూడెం పర్యటనకు వచ్చిన మంత్రులు హరీశ్‌రావు, జగదీష్‌రెడ్డిలకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్లు మాట్లాడారు. రోజురోజుకు తమపై పనిభారం పెరుగుతుందని అన్నారు. వెంటనే సమస్యలను పరిష్కరించేలా చూడాలని వినతిపత్రంలో మంత్రులను కోరారు.

అర్వపల్లి దేవాలయంలో ఎస్పీ పూజలు



ఎస్పీని సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు

అర్వపల్లి : అర్వపల్లిలోని శ్రీయోగానందలక్ష్మీనర్సింహస్వామి ఆలయాన్ని శుక్రవారం ఎస్పీ రాజేంద్రప్రసాద్, అదనపు ఎస్పీ ఎం.నాగేశ్వర్‌రావు, సూర్యాపేట డీఎస్పీ పి.నాగభూషణం సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ విశిష్టతను అర్చకుడు అర్వపల్లి రాంబాబుఅయ్యంగార్, పవన్‌కుమార్ వివరించారు. ఈ సందర్భంగా ఎస్పీ రాజేంద్రప్రసాద్‌ను జెడ్పీటీసీ దావుల వీరప్రసాద్‌యాదవ్, దేవస్థానం చైర్మన్ చిల్లంచర్ల విద్యాసాగర్‌లు సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీఐలు శివశంకర్, రాజేశ్‌నాయక్, ఎస్ఐ అంజిరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గుండగాని సోమేష్‌గౌడ్, బైరబోయిన రామలింగయ్య, కనుకు శ్రీనివాస్, పులిచర్ల ప్రభు, కడారి నరేష్, దావుల లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

రానున్న ఎన్నికల్లో లబ్ధిపొందడానికే హడావుడి

అర్వపల్లి : రానున్న ఎన్నికల్లో లబ్ధిపొందడానికే నియోజకవర్గంలో హడావుడిగా మంత్రుల పర్యటనలు జరుగుతున్నాయని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, నియోజకవర్గ ఇన్‌చార్జ్ కడియం రామచంద్రయ్య విమర్శించారు. శుక్రవారం అర్వపల్లిలో విలేకరులతో మాట్లాడారు. తొమ్మిదేళ్ల నుంచి నిర్లక్ష్యం చేసి తీరా ఎన్నికలు సమీపిస్తుండగా శంకుస్థాపనలు చేయడం శోచనీయమన్నారు. ఎన్నికల్లో గెలుపొందడం కోసమే తుంగతుర్తిలో 100పడకల ఆస్పత్రికి శంకుస్థాపన చేశారని విమర్శించారు. అర్వపల్లి దేవస్థాన అభివృద్ధికి గతంలో మంజూరు చేసిన రూ.2 కోట్ల నిధులు ఖర్చు పెట్టకుండానే మళ్లీ రూ.5కోట్లు కేటాయిస్తున్నట్లు ప్రకటించడం తగదన్నారు. రుద్రమచెరువును రిజర్వాయర్‌గా మారుస్తామని మంత్రులు హరీశ్‌రావు, జగదీష్‌రెడ్డిలు గతంలో ప్రకటించారని.. కానీ ఇంత వరకు ఎందుకు చేయలేదని అన్నారు. తండాలకు, వివిధ గ్రామాలకు బీటీ రోడ్లు మంజూరు చేస్తున్నామని ప్రకటించి పాలాభిషేకాలు చేయడం తప్ప బీటీ రోడ్లను ఎందుకు నిర్మించడం లేదన్నారు. మంత్రుల పర్యటన సందర్భంగా బీజేపీ నాయకులను అక్రమంగా అరెస్టు చేయడం సమంజసం కాదని పేర్కొన్నారు. ఈ సమావేశంలో బీజేపీ నాయకులు పగిళ్ల శంకర్, కూర శంకర్, కీర్తి వెంకటేశ్వర్లు, రాములు, నాగయ్య పాల్గొన్నారు.

ఆర్పీలకు వేతనాల పెంపు హర్షణీయం



పాలాభిషేకం చేస్తున్న నాయకులు

సూర్యాపేట : మెప్మా విభాగంలో పనిచేస్తున్న రిసోర్స్ పర్సన్‌లకు తెలంగాణ ప్రభుత్వం వేతనాలు పెంచడం హర్షణీయమని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వై.వెంకటేశ్వర్లు, మెప్మాల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు వెంపటి గురూజీ అన్నారు. ఆర్పీల వేతనాల పెంపుపై శుకవారం పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో హర్షం వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, జగదీష్ రెడ్డిల చిత్రపటాలకు పాలాభిషేకం చేసి మాట్లాడారు. మెప్మా ఆర్పీలకు గతంలో వేతనాలు లేవని.. సీఎం కేసీఆర్ వారికి రూ.4వేల గౌరవ వేతనం అందిస్తున్నారని అన్నారు. ప్రస్తుతం మరో రూ.2వేలు పెంచి మొత్తం రూ.6000 అందజేయడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మెప్మా ఆర్పీల యూనియన్ పట్టణ అధ్యక్షురాలు అన్నపర్తి రాణి, కార్యదర్శి కోలా మంగ, మంత్రాల పద్మ, నాగలక్ష్మి, నాగమణి, రజిని, శివ నాగేశ్వరి, లక్ష్మి, కె.పద్మ, విజయ, వాణి తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల భారీ బందోబస్తు



జాజిరెడ్డిగూడెంలో బందోబస్తును పరిశీలిస్తున్న ఎస్పీ, అదనపు ఎస్పీ, డీఎస్పీ

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం, అర్వపల్లిలలో మంత్రులు హరీశ్‌రావు, జగదీష్‌రెడ్డిల పర్యటన నేపథ్యంలో శుక్రవారం ఎస్పీ రాజేంద్రప్రసాద్, అదనపు ఎస్పీ నాగేశ్వర్‌రావు, డీఎస్పీ పి.నాగభూషణంల ఆధ్వర్యంలో భారీ బందోబస్తు నిర్వహించారు. ఈ బందోబస్తులో సీఐలు శివశంకర్, రాజేష్‌నాయక్, స్థానిక ఎస్ఐ అంజిరెడ్డి, సూర్యాపేట డివిజన్ పరిధిలోని సీఐలు, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎంఎస్ స్వామినాథన్ మృతి తీరనిలోటు

ఆత్మకూర్ (ఎస్) : వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ ఎంఎస్ స్వామినాథన్ మృతి దేశ రైతాంగానికి తీరని లోటని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి దండా వెంకట్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని నెమ్మికల్‌లో ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త ఎంఎస్ స్వామినాథన్ చిత్రపటానికి తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. హరిత విప్లవం ద్వారా దేశాన్ని స్వయం సమృద్ధిగా చేసిన గొప్ప శాస్త్రవేత్తగా స్వామినాథన్ అని అన్నారు. వరి, గోధుమల అధికోత్పత్తి వంగడాల వినియోగం ద్వారా పెను మార్పులు తెచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కమిటీ సభ్యుడు బెల్లంకొండ చక్రయ్య, గంపల ఎల్లయ్య, నాయకులు కోతి లక్ష్మారెడ్డి, గోలి భాగ్యమ్మ, కొల్లు వెంకన్న, రేణిగుంట రవి, ఎడ్ల నవనీత, రేణిగుంట్ల పర్వతాలు, గంపల ధనమ్మ, గరిగంటి భిక్షమమ్మ, చింతపల్లి వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సంఘం సభ్యత్వ నమోదు



సభ్యత్వాలు ఇస్తున్న సంఘం నాయకులు

ఆత్మకూర్ (ఎస్) : ఉపాధ్యాయులకు పీఆర్సీ నియమించి, ఐఆర్‌ను ప్రకటించాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పేరం ముత్తయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం మండల పరిధిలోని దాచారం, ఏపూరు, ఆత్మకూరు, నశీంపేట, కోటపహాడ్, మిద్దనపల్లి, ముక్తాకొత్తగూడెం, రామన్నగూడెం గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాల్లో సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఉపాధ్యాయ బదిలీలు చేపట్టి నియామకాలను చేయాలని డిమాండ్ చేశారు సీపీఎస్‌ను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సుభాని, మండల అధ్యక్షుడు మందాటి అశోక్, ప్రధాన కార్యదర్శి జిల్లా జానయ్య, భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతిపక్ష నాయకుల ముందస్తు అరెస్టు



తిరుమలగిరిలో అరెస్టయిన నాయకులు



నాగారం పోలీస్‌స్టేషన్‌లో..

తిరుమలగిరి : తుంగతుర్తిలో రాష్ట్ర వైద్యశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు, విద్యుత్ శాఖ మంత్రి జగదీష్ రెడ్డి బహిరంగ సభ దృష్ట్యా శుక్రవారం స్థానిక పోలీసులు కాంగ్రెస్, బీజేపీ నాయకులను ముందస్తుగా అరెస్టు చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడారు. ముందస్తుగా అరెస్టులు చేయడం హేయమైన చర్య అని అన్నారు. అరెస్టయిన వారిలో కాంగ్రెస్ పట్టణ శాఖ అధ్యక్షుడు పేరాల వీరేష్, గుండెపురి ఎంపీటీసీ సభ్యుడు జిమ్మిలాల్, బీజేపీ పట్టణ శాఖ అధ్యక్షుడు హన్మంతు యాదవ్, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

నాగారం : తుంగతుర్తి నియోజకవర్గ కేంద్రంలో జరిగే మంత్రి హరీశ్‌రావు బహిరంగ సభను అడ్డుకుంటారనే సమాచారంతో పోలీసులు యూత్ కాంగ్రెస్ నాయకులను శుక్రవారం ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా పలువురు యూత్‌కాంగ్రెస్ నాయకులు మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో ప్రజా సమస్యలను వ్యక్తం చేసే స్వేచ్ఛ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ నియంత పాలన కొనసాగిస్తున్నారని అన్నారు. అరెస్టయిన వారిలో యూత్ కాంగ్రెస్ నాయకులు షేక్ హుస్సేన్, షేక్. అక్బర్, షేక్.నాగుల్‌మీరా, రాజు, సుంకరి బన్ని, నాయకులు, తదితరులు ఉన్నారు.

గ్రామాల్లో ఇష్టారీతిన ఇటుక దందా!

- జోరుగా చెట్ల నరికివేత, మట్టి తవ్వకాలు
- విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న నిర్వాహకులు
- పట్టించుకోని అధికారులు



వట్టిఖమ్మంపహాడ్‌లో నిర్వహిస్తున్న ఇటుక బట్టీ



ఎర్ర సూర్యాతండాలో..

చివ్వెంల : మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఇటుక బట్టీల దందా జోరుగా కొనసాగుతోంది. ప్రభుత్వ భూముల్లో మట్టిని తీసుకెళ్లి యథేచ్ఛగా ఇటుకలు తయారు చేస్తున్నారు. రెవెన్యూ అధికారుల నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండా అక్రమార్కులు ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారు. మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని వట్టిఖమ్మంపహాడ్, ఐలాపురం, గాయంవారి గూడెం, కుడకుడ, దురాజ్‌పల్లి, ఎర్ర సూర్యానాయక్ తండా, లక్ష్మణ్ నాయక్ తండా, పాశ్యానాయక్ తండా, బి.చందుపట్ల తండా గ్రామాల్లో ఇటుక బట్టిల వ్యాపారం జోరుగా సాగుతుంది. నిర్వాహకులు అనుమతులు లేకుండానే ఇటుక బట్టీలు ఏర్పాటు చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు పేర్కొంటున్నారు.

అధికారుల పట్టింపు కరువు..

ఇటుకల తయారీకి అనుకూలమైన మట్టిని ప్రభుత్వ భూముల్లో తవ్వకాలు జరిపి తీసుకువెళ్తున్నారు. జేసీబీలతో తవ్వి వందలాది ట్రాక్టర్లలో మట్టిని తరలిస్తున్నా సంబంధిత అధికారుల తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఇదేమిటని కొందరు వ్యాపారులను ప్రశ్నించగా తమ పొలాల నుంచే మట్టిని తీసుకువెళ్తున్నామని తెలుపుతున్నారు. ఇటుకల తయారీకి నీటి అవసరం ఎక్కువగా ఉండటంతో సంబంధిత వ్యాపారులు రైతుల పొలాల్లో వ్యవసాయ బోర్లను లీజుకు తీసుకొని నీటిని వినియోగిస్తున్నారు. రైతులకు ఇచ్చే ఉచిత విద్యుత్‌ను ఇటుక బట్టీల వ్యాపారానికి అక్రమంగా వాడుతున్నారు. ఇలా వ్యవసాయానికి కేటాయించిన ఉచిత విద్యుత్ చౌర్యానికి గురవుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

బట్టీలకు కలప తరలిస్తూ..

ఇటుకల తయారీ అనంతరం వాటిని కాల్చడానికి బొగ్గు, వరిపొట్టు, కట్టెలను ఉపయోగిస్తారు. కానీ మండలంలో అడవులు సమీపంలో ఉండటంతో ఎక్కువగా కట్టెలను ఉపయోగిస్తారు. అటవీ ప్రాంతం నుంచి గుట్టుచప్పుడు కాకుండా రాత్రికి రాత్రే కలపను అక్రమంగా బట్టీల వద్దకు తరలిస్తున్నారు.

అధికారుల కనుసన్నల్లోనే..

ఇటుక బట్టీలకు మట్టి, కలప, విద్యుత్‌ను సంబంధిత అధికారులకు తెలిసే వ్యాపారులు వాడుతున్నారు. అధికారులు వ్యాపారుల వద్దకు వెళ్లి వివరాలు అడిగిన దాఖలాలు లేవు. ఇటుక బట్టీల తయారీకి అనుమతులు తీసుకునేటట్లు అధికారులు పకడ్బందీ చర్యలు తీసుకోవాలి.

– సీహెచ్. కిరణ్, వట్టిఖమ్మంపహాడ్

కేసులు నమోదు చేయాలి

ఏటా మండలంలోని గ్రామాల్లో ఇటుకల వ్యాపారం జోరుగా నడుస్తోంది. అందుకు ముందుగా ఆయా శాఖల అనుమతులు తీసుకునేలా ఇటుకల తయారీ వ్యాపారులకు అధికారులు ఆదేశాలు ఇవ్వాలి. అనుమతులు తీసుకోకుంటే తగిన జరిమానా విధించి కేసులు నమోదు చేయాలి.

– ఎండీ.రఫీ, చివ్వెంల

అనుమతులు తప్పరిసరి

గ్రామాల్లో నిర్వహిస్తున్న ఇటుక బట్టీలకు నిర్వాహకులు ప్రభుత్వ అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలి. ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా ఇటుక బట్టీలు నిర్వహిస్తున్నట్లు తెలిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం.

– ఎల్.లక్ష్మి, ఎంపీడీఓ, చివ్వెంల

ఎస్సారెస్పీ కాల్వల వెంట సంపద వనాలు

- జాజిరెడ్డిగూడెం మండలానికి తొమ్మిది వనాలు మంజూరు
- ఎనిమిది నిర్మాణాలు పూర్తి, కొనసాగుతున్న మరో వనం పనులు

అర్వపల్లి : నీటి పారుదల శాఖ పరిధిలోని ఎస్సారెస్పీ కాలువల వెంట తెలంగాణ దశాబ్ది సంపద వనాలను ఏర్పాటు చేస్తున్నారు. పల్లెప్రకృతి వనాల మాదిరిగానే సంపద వనాల్లో కూడా వివిధ రకాల మొక్కలను పెంచుతున్నారు. ముఖ్యంగా ఈ సంపద వనాల్లో పండ్ల మొక్కలు పెంచాలని నిర్ణయించారు. జాజిరెడ్డిగూడెం మండలంలో పర్సాయపల్లి నుంచి తిమ్మాపురం వరకు 71డీబీఎం ప్రధాన కాలువ 16 కిలోమీటర్ల పొడవు ఉంటుంది. ఈ కాలువ వెంట ఉన్న స్థలాల్లో తెలంగాణ దశాబ్ది సంపద వనాలను ఏర్పాటు చేస్తున్నారు.

జాజిరెడ్డిగూడెం మండలంలో ఇలా..

జాజిరెడ్డిగూడెం మండలానికి తెలంగాణ దశాబ్ది సంపద వనాలు 9 మంజూరయ్యాయి. ఇందులో ఇప్పటికే 8వనాల పనులు పూర్తయ్యాయి. మరో సంపద వనం పని జరుగుతుంది. ఇందులో అర్వపల్లిలో 4, రామన్నగూడెంలో 2, అడివెంలలో 2, కాసర్లపహాడ్‌లో 1 చొప్పున సంపద వనాలను ఏర్పాటు చేశారు. కాగా ఈ వనాల్లో 4,784 మొక్కలను నాటాల్సి ఉండగా ఇప్పటికే 4,170 మొక్కలను నాటారు. ఈ వనాలకు చుట్టూ ఫెన్సింగ్, గేట్ ఏర్పాటు చేయనున్నారు. వనాన్ని సూచించే బోర్డును కూడా ఏర్పాటు చేస్తున్నారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో భాగంగా ఈ వనాల్లో మొక్కలు నాటుతుండగా, హరితనిధి నిధులతో ఈ వనాలకు ఫెన్సింగ్, గేట్, బోర్డు ఏర్పాటు చేస్తున్నారు. కాగా ఈ సంపద వనాల్లో జామ, చింత, టేకు మొక్కలను నాటుతున్నారు.



రామన్నగూడెం సంపద వనంలో నాటిన మొక్కలు

4,170 మొక్కలు నాటాం



జాజిరెడ్డిగూడెం మండలానికి మంజూరైన 9 తెలంగాణ దశాబ్ది సంపద వనాల్లో మొత్తం 4,784 మొక్కలను ఉపాధిహామీ పథకం ద్వారా నాటాలని లక్ష్యం పెట్టుకున్నాం. కాగా ఇప్పటివరకు 4,170 మొక్కలను నాటడం జరిగింది. ఎక్కువగా పండ్ల మొక్కలను నాటుతున్నాం.

– సీహెచ్.ఉపేందర్, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ

పనులు జరుగుతున్నాయి



జాజిరెడ్డిగూడెం మండలంలో ఎస్సారెస్పీ 71డీబీఎం కాలువ వెంట తొమ్మిది సంపద వనాలు మంజూరయ్యాయి. ఇప్పటి వరకు 8 వనాలను నిర్మించడం జరిగింది. మరో సంపద వనం పనులు పూర్తి చేయనున్నాం. వనాల చుట్టూ ఫెన్సింగ్, గేట్లు, బోర్డుల ఏర్పాటు పనులు జరుగుతున్నాయి.

– సందీప్‌కుమార్, ఎంపీఓ, జాజిరెడ్డిగూడెం

బాల్యవివాహాల నిర్మూలనపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న కళాకారులు

ఆత్మకూర్ (ఎస్) : కలెక్టర్, జిల్లా పౌర సంబంధాల శాఖ అధికారి ఆదేశాల మేరకు తుమ్మలపెన్‌పహాల్ మహిళా అభివృద్ధి శాఖ, సఖి సెంటర్, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం బేటీ బచావో బేటీ పడావో, లింగ నిర్ధారణ నిర్మూలన, బాల్య వివాహాల నిర్మూలన తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సాంస్కృతిక సారథి వేముల నరేష్ బృందం నిర్వహించిన కళాప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో సర్పంచ్ యల్లాచారి, గంట భిక్షపతి, ఈర్ల సాయి, పల్స నిర్మల, వేముల శ్రావణ్, నిమ్మది స్రవంతి, మేడి ప్రియదర్శిని, సిర్పంగి రాధ, మేడి ఇంద్రజ తదితరులు పాల్గొన్నారు.

గణేశ్ నిమజ్జన వేడుకలు

తిరుమలగిరి : తిరుమలగిరి మున్సిపల్ కేంద్రంలోని ఆర్యవైశ్య సంఘంలో ఏర్పాటు చేసిన గణేశ్ విగ్రహానికి శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వినాయక విగ్రహాన్ని డప్పు చప్పుళ్లు, కోలాటాలతో శోభాయాత్రగా తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రైస్ మిల్లర్స్ జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు ఇమ్మడి సోమనర్సయ్య, సామ ఆంజనేయులు, తునికిపాటి రాంబాబు, ఉపేందర్, శేఖర్, దొడ్డ రమేష్, కొండా ఈశ్వరయ్య, సుధాకర్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛతా హీ సేవా పక్షోత్సవాలు



కొమ్మాలలో నిలువ ఉన్న నీటిని తొలగిస్తున్న కార్యదర్శి నారాయణమూర్తి, వైద్యసిబ్బంది

సూర్యాపేట రూరల్ : మండల పరిధిలోని తాళ్లఖమ్మంపహాడ్‌లో కేవీకే గడ్డిపల్లి ఆధ్వర్యంలో లయోలా అకాడమీ సికింద్రాబాద్ వ్యవసాయ కళాశాల విద్యార్థినులు శుక్రవారం స్వచ్ఛత అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వీధుల్లో, పాఠశాలల ప్రాంగణాల్లో చెత్తాచెదారం తొలగించారు. అనంతరం గ్రామంలో స్వచ్ఛతపై ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్త నరేష్, విద్యార్థినులు సాయిలలిత, లిపిక, హర్షిత తదితరులు పాల్గొన్నారు.

అర్వపల్లి : కొమ్మాల గ్రామంలో శుక్రవారం స్వచ్ఛతా హీ సేవా పక్షోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ కార్మికులు వీధులు, మురుగు కాలువలను శుభ్రం చేశారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామంలో ర్యాలీ జరిపారు. అలాగే నిలువ ఉన్న నీటిని తొలగించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గంగధరి వెంకటమ్మ, పంచాయతీ కార్యదర్శి నారాయణమూర్తి, వైద్యసిబ్బంది, గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అత్యాచార నిందితులను శిక్షించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కొత్తపల్లి రేణుక

దురాజ్‌పల్లి : మధ్యప్రదేశ్ రాష్ట్రం ఉజ్జయిని నగరంలో 12 ఏళ్ల బాలికపై అత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని పీఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రేణుక డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఆ సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. అత్యాచారానికి గురైన 12 ఏళ్ల బాలిక రక్షించండి అంటూ నగ్నంగా పరిగెడుతుంటే సెల్ఫీలు తీయడం సభ్య సమాజం తలదించుకునేలా ఉందన్నారు. దేశంలో రోజురోజుకూ ఆడవారిపై దాడులు పెరుగుతున్నా ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. నిందితులను సమాజ బహిష్కరణ చేసి జీవించే హక్కు లేకుండా చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఆ సంఘం సహాయ కార్యదర్శి సూరం రేణుక, వెంకటమ్మ, పద్మ, పూజిత తదితరులు పాల్గొన్నారు.

మహిళా బిల్లు అమలు చేయాలి

మునగాల : మహిళా బిల్లు చట్టసభల్లో ఆమోదం పొందినప్పటికీ, కేంద్ర ప్రభుత్వం ఈ విధానాన్ని 2023 ఎన్నికల్లో అమలు చేయబోమని చెప్పడం మహిళలను మోసం చేయడమేనని రాష్ట్ర మహిళా సంఘం కార్యదర్శి మల్లు లక్ష్మి అన్నారు. శుక్రవారం మునగాలలో నిర్వహించిన జీపుజాతా ప్రచారంలో ఆమె మాట్లాడారు. మహిళా బిల్లును 2023లో అమలు చేయకపోవడం కేంద్ర ప్రభుత్వం ఆడుతున్న డ్రామా అని విమర్శించారు. మహిళా బిల్లును తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికలకు ముందు రాష్ట్ర ప్రభుత్వం పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు, దళితులకు మూడెకరాల భూమి ఇస్తామని చెప్పి నేటికీ అమలు చేయలేదని ఆరోపించారు. నేటికీ తెలంగాణలో లక్షలాది మంది ప్రజలు ఇంటి స్థలాలు, ఇళ్లు లేక నానా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్తగా రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న అర్హులైన పేదలకు రేషన్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా మహిళా సంఘం కార్యదర్శి మేకనబోయిన సైదమ్మ, మహిళాసంఘం నాయకురాళ్లు ఎం.జ్యోతి, జె.విజయలక్ష్మి, రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యురాలు కొప్పుల రజిత, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు దేవరం వెంకటరెడ్డి, డీవైఎఫ్ఐ మండల కార్యదర్శి గడ్డం వినోద్ పాల్గొన్నారు.



ప్రచారంలో మాట్లాడుతున్న మల్లు లక్ష్మి